క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



గండేపల్లిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ దొరబాబు

గండేపల్లి: వచ్చే సార్వత్రిక ఎన్నికలకు కేడర్ సిద్ధంగా ఉందని ఎంపీపీ చలగళ్ల దొరబాబు తెలిపారు. గండేపల్లిలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 125 సార్లు బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ములు జమ చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు రెండు సార్లు బటన్ నొక్కి మళ్లీ ఆయనను సీఎంగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, గ్రామ సర్పంచ్ రుత్తల లలిత, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సత్రం భూమిని ఆకమ్రిస్తే చర్యలు

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరంలో యల్లపు నరసయ్య అన్నసత్రం భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం సత్రం వద్ద నోటీసు అతికించారు. జగపతినగరంలోని యల్లపు నరసయ్య అన్నసంత్రానికి చెందిన 361/3 సర్వే నెంబర్‌లోని 0.50 సెంట్ల దేవదాయ శాఖ భూమిలోకి ఎవరైనా ప్రవేశించినా, ఆక్రమించేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎంఎస్ రమణి హెచ్చరించారు.

నిధుల వినియోగంపై సామాజిక తనిఖీ

కిర్లంపూడి: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ మండలి ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వారికి అండగా నిలుస్తోందని కార్మిక శాఖ సహాయ కమిషనర్ జి.కేశవరావు అన్నారు. మండలంలో 2018–2019, 2019–2020 సంవత్సరాల్లో ప్రమాద బీమా, పెళ్లి కానుక తదితర పథకాల్లో సంక్షేమ మండలి ద్వారా 50 మంది లబ్ధిదారులకు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధుల వినియోగానికి సంబంధించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశపు హాలులో బుధవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. నిధుల వినియోగంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, ఏపీఓ నాగమణి, ఎస్ఆర్‌పీలు చిరంజీవి, సూర్య తదితరులు పాల్గొన్నారు.


నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తుని: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన మధ్యాహ్నం 12 గంటలకు జరిగే సమావేశంలో చర్చించేందుకు పట్టణాభివృద్ధికి సంబంధించి పలు అంశాలను అజెండాలో పొందుపరిచామన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెం గ్రామ శివారున పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై కె.నాగరాజు బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.40,150 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

గ్రామాల్లో పోలీసుల మాక్ డ్రిల్



కాట్రావులపల్లిలో మాక్ డ్రిల్ చేస్తున్న పోలీసు బలగాలు

జగ్గంపేట: వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ట్రైనీ ఐపీఎస్ అధికారి నవజ్యోతి మిశ్రా కోరారు. ఎన్నికల నేపథ్యంలో మండలం మల్లిసాల, కాట్రావులపల్లి గ్రామాల్లో బుధవారం పోలీసులు మాక్ డ్రిల్ (పోలీస్ బలగాల కవాతు) నిర్వహించారు. ఈ సందర్భంగా నవజ్యోతి మిశ్రా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో కీలకమన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యం, వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ తీగ చోరీ

గండేపల్లి: యర్రంపాలెంలోని పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి దానిలో కాపర్ వైర్‌ను చోరీ చేశారు. దీనిపై బాధిత రైతులు బుధవారం గండేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం



రౌతులపూడిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- శంఖవరంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

శంఖవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన దేశానికే ఆదర్శమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. శంఖవరంలో ఎంపీపీ పర్వత రాజుబాబు అధ్యక్షతన గురువారం పేదలకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. ఎన్నికల హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. కులమతాలు, రాజకీయాలకు తావు లేకుండా ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి చరిత్ర సృష్టించారన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ప్రతిపక్షాల మాయమాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజకుమారి, ఎంపీడీఓ ఎం.విజయ్‌కుమార్, ఎంఈఓ ఎస్‌వీ రమణ, ఈఓపీఆర్డీ రామకృష్ణ, సర్పంచులు ఈగల విజయదుర్గ, సకురు గుర్రాజు, దూడల రామస్వామి, ఎంపీటీసీ దడాల సతీష్, సొసైటీ చైర్మన్ పర్వత సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కొండపల్లి అప్పారావు, ఆచంట వెంకటేశ్వరరావు, పడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

రౌతులపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. రౌతులపూడిలో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు వాసిరెడ్డి జమీలు అధ్యక్షతన నిర్వహించిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని 2979 మంది లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను వరుపుల సుబ్బారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను తూ.చా. తప్పకుండా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి లక్ష్మీభాస్కరబాబు, సర్పంచ్ కటారి అర్జునమ్మ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పోలువర్తి తాతాజీ, పార్టీ నాయకులు కాకి నాని, జిగిరెడ్డి సత్తిబాబు, సర్పంచులు సర్నం శ్రీను, వడ్లమ సత్యనారాయణ, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఎంపీడీఓ ఎం.ప్రేమ్ సాగర్, హౌసింగ్ ఏఈ ఎ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



కృష్ణునిపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన తోట నరసింహం, నాయకులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

గోకవరం: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శ్రీకారం చుట్టారు. కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని చిన్నూరులో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. కృష్ణునిపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. గోకవరం పంచాయతీ పరిధిలోని వీరలంకపల్లిలో వెల్‌నెస్ సెంటర్, రంపయర్రంపాలెంలో సచివాలయ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను, ప్రజా అవసరాలు తీర్చడానికి సచివాలయాలు, రైతు సమస్యల పరిష్కారానికి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. త్వరనే ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వ భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు నూతన భవనాలను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యువ నాయకుడు తోట రాంజీ, ఎంపీపీ సుంకర శ్రీవల్లి, నాయకులు సుంకర వీరబాబు, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, సమ్మెటి నాని, రౌతు జోగేశ్వరరావు, సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), వైస్ ఎంపీపీ మడికి మైనర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- గ్రామాల్లో ప్రభుత్వ భవనాల ప్రారంభం



తిరుమాలిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని తిరుమాలిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించేందుకు సచివాలయ వ్యవస్థను ప్రారంభించారన్నారు. అవినీతికి తావులేకుండా సచివాలయ వ్యవస్థ పని చేస్తోందన్నారు. సచివాలయాల ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు సూతి వీరకృష్ణ ప్రసాద్, కూనపురెడ్డి సుబ్బారావు, బుద్దా సూర్యప్రకాశ్, పీతల నూకరాజు, ఎంపీటీసీ సభ్యుడు పసల సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నేత బదిరెడ్డి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పాలన

ప్రత్తిపాడు రూరల్: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని గజ్జనపూడిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మొల్లి వీరబాబు, వైస్ సర్పంచ్ వంగలపూడి సూర్యకాంతం, సాలివాహన సంక్షేమ సంఘం జిల్లా డైరెక్టర్ అనకాపల్లి నూకరాజు, పార్టీ నాయకులు బర్ల నాగరాజు, గొనగాల వెంకటరమణ, బోడపాటి వీరనాగేశ్వరరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సేవలను విస్తరించాలి



జె.అన్నవరం పీహెచ్‌సీలో వైద్యురాలు శ్రీలక్ష్మిని సత్కరిస్తున్న ఎంపీపీ బుజ్జి, ప్రజాప్రతినిధులు

ఏలేశ్వరం: గ్రామాల్లో ప్రజలకు పీహెచ్‌సీ సేవలను విస్తరించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. మండలంలోని జె.అన్నవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన పీహెచ్‌సీని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధుల కృషి ఫలితంగానే జె.అన్నవరానికి పీహెచ్‌సీ మంజూరైందన్నారు. పీహెచ్‌సీ ఏర్పాటుతో ప్రజల కష్టాలు తీరతాయన్నారు. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం ఆసుపత్రి వైద్యురాలు శ్రీలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

కోటనందూరు: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని సర్పంచ్ పసగడుగుల వరహాలు అన్నారు. మండలంలోని పాతకొట్టాంలో బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రజలకు సొంతూరులోనే నిష్ణాతులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నారన్నారు. రోగులు పూర్తిగా కోలుకునే వరకూ వైద్య సిబ్బంది వారిని పర్యవేక్షిస్తున్నారన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో 150 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పలకా సత్యనారాయణ, తోలెం రాజులు, హైస్కూల్ పీఎంసీ చైర్మన్ యడ్ల నాగేశ్వరరావు, పసగడుగుల గోపీ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

శంఖవరం: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తోట సీతారామయ్య సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజ్ఞా–వికాస పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. మండల స్థాయిలో ప్రథమ బహుమతి ఎన్.వెంకటేష్, ద్వితీయ బహుమతి ఎన్.గనిలక్ష్మి, తృతీయ బహుమతి జీవీవీఎస్ జశ్వంత్ సత్యసాయి కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం టి.భాస్కరలక్ష్మి, యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీఎస్ఎస్ చంటిబాబు, పి.రవిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్యం, రోజూ చేయించాల్సిన వ్యాయామాల పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. ప్రభుత్వం పూర్తి ఉచితంగా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐఈఆర్పీలు నాగగోవిందు, నారాయణరావు పాల్గొన్నారు.

జగనన్న పాలసేకరణ కేంద్రం ప్రారంభం

గోకవరం: పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న పాల సేకరణ కేంద్రాలను మహిళా పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు సూచించారు. మండల కేంద్రమైన గోకవరంలో ఏర్పాటు చేసిన జగనన్న పాలసేకరణ కేంద్రాన్ని బుధవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ ద్వారా మహిళా రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. దీనిలో భాగంగా మండలంలోని 11 పంచాయతీల్లో పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, తోలేటి రాంప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టండి

- మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- తునిలో ఎన్నికల ప్రచారం



తునిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి రాజా తనయుడు శంకర్ మల్లిక్, చైర్‌పర్సన్ సుధారాణి

తుని: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు, యువ నాయకుడు దాడిశెట్టి శంకర్ మల్లిక్ కోరారు. పట్టణంలోని 25వ వార్డు రామకృష్ణాకాలనీలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలన్నారు. నాలుగున్నర ఏళ్లలో పట్టణంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మీకు మంచి జరిగితేనే మాకు ఓటు వేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్నారని, ఇదే విషయాన్ని టీడీపీ, జనసేన నాయకులు ఎందుకు చెప్పలేక పోతున్నారని ప్రశ్నించారు. తుని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న దాడిశెట్టి రాజాను మళ్లీ గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, తుని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన అవసరం



ప్రత్తిపాడులో అధికారులకు అవగాహన కల్పిస్తున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగించే ఓటింగ్ యంత్రాలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల రెవెన్యూ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్ కమిటీ (ఎంసీసీ), ఫ్లయింగ్ స్క్వాడ్ టీం (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వే లైన్స్ టీం (ఎస్ఎస్‌టీ), వీడియో సర్వే లైన్ టీం (వీఎస్‌టీ), వీడియో వ్యూయింగ్ టీం (వీవీటీ), పోలింగ్ అభ్యర్థుల ఖర్చులు పరిశీలన (అకౌంటింగ్) బృందాల పనితీరును వివరించారు. ఓటింగ్ యంత్రాల పనితీరును విశదీకరించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు వివిధ పార్టీల రాజకీయ నాయకులు పోలింగ్ సిబ్బందికి సహకరించాలని కోరారు. అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు ఎం.రాజబాబు, చుక్కల లక్ష్మీగణేష్ పోలింగ్ నిర్వహణపై అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల తహసీల్దార్లు ఎస్. నరసింహారావు, వై.రంగారావు, ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ శివప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) టి.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, విద్యార్థి విభాగం నాయకులు బెహరా లక్ష్మీప్రసన్న, బీజేపీ నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, మదినే ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

జగ్గంపేట: స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఈవీఎంల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గ ఈఆర్‌ఓ ఎం.శ్రీనివాసరావు ఈవీఎం, వీవీప్యాట్, ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- వేలంకలో ఆత్మీయ సమావేశం



మర్రిపాకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న తోట వాణి

కిర్లంపూడి: సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. వేలంకలో వైఎస్సార్ సీపీ నాయకుడు దోమాల గంగాధర్ అధ్యక్షతన బుధవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల హామీలను 100 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పేదల కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. భవిష్యత్ మరిన్ని పథకాలు అమలు చేయాలంటే మరోసారి జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలన్నారు. కార్యక్రమంలో యువనాయకుడు తోట రాంజీ, పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, మండలాధ్యక్షుడు పెనగంటి రాజేష్, అడబాల శ్రీను, శెట్టి సోమరాజు, ఓలేటి రాజు, జోకా శ్రీను, దాడి చిన బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం

జగ్గంపేట: పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతిఒక్కరూ సిద్ధం కావాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం సతీమణి తోట వాణి అన్నారు. మండలంలోని మర్రిపాకలో బుధవారం వైఎస్సార్ సీపీ నేత గట్టి సతీష్ ఆధ్వర్యంలో తోట వాణి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. జగన్ పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో యువ నేత తోట రాంజీ సతీమణి శ్రీనిధి, గ్రామ సర్పంచ్ జగతా ఆనందరావు, వైఎస్సార్ సీపీ నేతలు, అత్తులూరి సాయిబాబా, గఫూర్, తులా రాము పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా సూర్యచంద్ర ఎన్నికల ప్రచారం

గోకవరం: టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా జగ్గంపేట ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించి భంగపడిన జనసేన ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా జ్యోతుల నెహ్రూను ప్రకటించడంతో సామాన్యులు అసెంబ్లీకి వెళ్లడానికి అవకాశం కల్పించలేదంటూ నిరసన చేపట్టి ఆరురోజుల పాటు గోకవరం మండలం అచ్యుతాపురంలో సతీమణి శ్రీదేవితో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూకు మద్దతు ఇవ్వబోమని ప్రకటించారు. సామాన్యుడు సైతం అసెంబ్లీకి వెళ్లగలడు అని నిరూపిస్తానని దీక్ష విరమించిన ఆయన ఇటీవల జగ్గంపేట మండలం రాజపూడిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తానని ప్రకటించారు. దీనిలో భాగంగా బుధవారం గోకవరం మండలం నుంచే ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. సూర్యచంద్ర గెలుపు సామాన్యులందరి గెలుపు పేరుతో అచ్యుతాపురం, గుమ్మళ్లదొడ్డి, వెదురుపాక, బావాజీపేట, వీరలంకపల్లి గ్రామాల్లో భార్య శ్రీదేవి, మద్దతుదారులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

సంక్షేమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి



తునిలో మహిళా సంఘాలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోన్న ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి కోరారు. స్థానిక బ్యాంకు కాలనీ బాలభవన్ వద్ద బుధవారం కమిషనర్ వెంకట్రావు అధ్యక్షతన మహిళలకు నాల్గో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్‌పర్సన్ సుధారాణి మహిళా సంఘాలకు రూ.5.30 కోట్ల విలువైన నమూనా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలను దశల వారీగా మాఫీ చేస్తామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లోనూ మౌలిక వసతులను కల్పించామన్నారు. సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్య చక్రరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, యువత తుని పట్టణశాఖ అధ్యక్షుడు గొల్లపూడి బుచ్చిరాజు, తుని పాత బజారువీధి వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మార్నీడి శ్రీను, జిల్లా టెలికం సభ్యుడు మద్దాల కరుణాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- చిన్నింపేటలో గడప గడపకూ..



చిన్నింపేటలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని చిన్నింపేటలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మద్దతు సీఎం జగన్‌కే ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మళ్లీ పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే సీఎం జగన్‌కు మళ్లీ అధికారం ఇవ్వాలని కోరారు. తొలుత గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అడపా పార్థసారథి, అల్లం ఆదినారాయణ, మజ్జూరి సూర్యనారాయణ, యల్లపు విష్ణు, శిడగం రాజు, సాదే లోవరాజు, పీతల నూకరాజు, సోము సూరీడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రస్ట్‌బోర్డు సమావేశం

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం గురువారం మధ్యాహ్నం 2–30 గంటలకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరుగనుంది. ఈ సమావేశంలో దేవస్థానం ఈఓ కె. రామచంద్రమోహన్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొంటారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఏప్రిల్ 15 వ తేదీ వరకు జరుగనున్న సత్యదేవుని నూతన స్వర్ణ ధ్వజస్తంభం ప్రతిష్ట ఏర్పాట్లు, మే నెల 18 నుంచి 24వ తేదీ వరకు జరుగనున్న సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల ఏర్పాట్లపై సమావేశంలో చర్చించనున్నారు.

వైభవంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం

ప్రత్తిపాడు: స్థానిక అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారి పంచాయతన క్షేత్రంలో బుధవారం రాత్రి విశ్వేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఆశీనులు గావించారు. అనంతరం శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. తొలుత పల్లకీలో స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త తేజోమూర్తుల వీరభద్రప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు చామర్తి వీరబాబు, కొమ్ముల ఆనంద్, చామర్తి కృష్ణ, ఆనాల ఉమాశంకర్, పంచాయతీ కార్యదర్శి ఎంవీ రామరాజు వర్మ తదితరులు పాల్గొన్నారు.